# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ:  16-01-2025          సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- పేదరికం లేని సమాజాన్ని ఆవిష్కరించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.
- అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో మంత్రి వర్గ సమావేశం రేపు జరగనుంది.
- మరో రెండు నెలలలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని అమలు చేస్తామని  మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వెల్లడించారు.
- కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈ నెల 18వ తేదీన రాష్ట్రానికి రానున్నారు.
- సంక్రాంతికి వచ్చిన వారంతా తిరుగు ప్రయాణమవ్వడంతో రైళ్లు, బస్టాండ్‌లలో రద్దీ పెరిగింది.

==========================

రాష్ట్రంలో అభివృద్ధి ద్వారా సంపద సృష్టిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఈ  రోజు పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పెరిగిన ఆదాయంతో సంక్షేమాన్ని కొనసాగిస్తామని అన్నారు. పేదరికం లేని సమాజాన్ని ఆవిష్కరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. అందులో భాగమే విజన్-2047 డాక్యుమెంట్ అని చెప్పారు.  ఈ లక్ష్యాలను సాకారం చేసేందుకు ప్రజలను భాగస్వామ్యం చేస్తున్నామని ముఖ్యమంత్రి పేర్కొంటూ..

(వాయిస్ 33 సెకన్లు)

==========================

అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో మంత్రి వర్గ సమావేశం రేపు నిర్వహించనున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు వివిధ సంక్షేమ పథకాలపైన చర్చించబోతున్నారని అధికార వర్గాలు పేర్కొన్నాయి. అదే విధంగా రైతు భరోసా హామీ, పలు కంపెనీలకు భూముల కేటాయింపులు, మద్యం దూకణాలను 10 శాతం గీత కార్మికులకు కేటాయించడం వంటి అంశాలపై కూడా మంత్రి వర్గ సమావేశంలో చర్చించే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి.

==========================

రాష్ట్రంలో మరో రెండు నెలలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలవుతుందని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా నాయుడుపేటలో ఈ రోజు ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఇప్పటికే మహిళలకు సంవత్సరానికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని అందిస్తున్నామని గుర్తు చేశారు. సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వం అనేక కార్యక్రమాలను నిర్వహిస్తోందని తెలిపారు. రాష్ట్రంలో కొత్త పరిశ్రమలు వస్తున్నాయని.. తద్వారా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 32 సెకన్లు)

==========================

కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈ నెల 18వ తేదీన రాష్ట్రానికి రానున్నారని అధికార వర్గాలు తెలిపాయి. ఆ రోజు రాత్రి ఢిల్లీ నుంచి విజయవాడలోని గన్నవరం విమానాశ్రయానికి ప్రత్యేక విమానంలో కేంద్ర మంత్రి చేరుకుంటారు. 19వ తేదీన విజయవాడ సమీపంలోని కొండపావులూరులో నిర్మించిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌తో పాటు 10వ బెటాలియన్ ఎన్డీఆర్ఎఫ్ క్యాంపులను అమిత్ షా ప్రారంభిస్తారు. అనంతరం ఆయన బహిరంగ సభలో ప్రసంగిస్తారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో పాటు, ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ కూడా ఈ పర్యటనలో పాల్గొంటారు. కాగా, కేంద్ర హోమ్ మంత్రి పర్యటన కోసం రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తోంది.

==========================

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని సొంతూళ్లకు వచ్చిన వారంతా తిరుగు ప్రయాణమవ్వడంతో విజయవాడ బస్టాండ్, రైల్వే స్టేషన్‌లలో ఈ రోజు రద్దీ పెరిగింది. దీంతో పలు ప్రాంతాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. విజయవాడ నుంచి హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, తదితర ప్రాంతాలకు అదనపు సర్వీసులను అందుబాటులోకి తీసుకొచ్చింది. అదనపు బస్సులలో ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కల్పించామని ఆర్టీసీ అధికారులు పేర్కొన్నారు. సాధారణ ఛార్జీలే వసూలు చేస్తున్నట్లుగా తెలిపారు. మరో వైపు జాతీయ రహదారులపైన వాహనాల సంఖ్య పెరగడంతో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పోలీసులు ముందస్తు ఏర్పాట్లు చేశారు.

విరామం

==========================

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని బనగానపల్లెలో షాదీఖానా పునః నిర్మాణ పనులను రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... వీలైనంత త్వరగా షాదీఖానా నిర్మాణం పూర్తి చేసి ముస్లిం మైనారిటీలకు అందుబాటులోకి తెస్తామని తెలిపారు. అదే విధంగా స్థానికంగా ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగిస్తామని మంత్రి స్పష్టం చేశారు.

==========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 18వ తేదీన వైఎస్సార్ జిల్లా మైదుకూరులో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా అధికారులందరు సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. ముఖ్యమంత్రి జిల్లా పర్యటన నేపధ్యంలో కలెక్టర్ కార్యాలయంలో ఈ రోజు జిల్లా అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రణాళికా బద్ధంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

==========================

పాల ఉత్పత్తులు మాంసం ఉత్పత్తులు గణనీయంగా పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం గోకులాలు పేరుతో షెడ్డులను నిర్మిస్తోందని శ్రీకాకుళం జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ కంచరాన రాజగోపాలరావు తెలిపారు. శ్రీకాకుళంలో ఈ రోజు పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ... జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గ్రామీణ ప్రాంతాలలో పశువుల షెడ్డులను నిర్మించుకున్న వారికి రాయితీలు ప్రోత్సాహకాలు ఇస్తున్నారని ఆయన తెలిపారు. కాగా, శ్రీకాకుళం జిల్లాలో 30 మండలాల పరిధిలో ఇంతవరకు 1,413 గోకులాలు మంజూరు చేయగా ఇందులో 696 పనులు పూర్తి అయ్యాయని పేర్కొన్నారు.

==========================

తిరుపతి జిల్లాలో ఈ నెల 18వ తేదీ నుండి మూడు రోజుల పాటు “ఫ్లెమింగో బర్డ్స్ ఫెస్టివల్”ని నిర్వహిస్తున్నామని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో ఈ రోజు పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ... జిల్లాలోని సూళ్లూరుపేటలో ఫ్లెమ్మింగో ఫెస్టివల్ ఈనెల 20వ తేదీ వరకూ జరుగుతుందన్నారు. పులికాట్ ప్రాంతానికి పెలికాన్ పక్షులు, అరుదైన పక్షులు వస్తుంటాయని తెలిపారు. వీటి గురించి ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అదే విధంగా విదేశీ పక్షుల సంరక్షణ, పులికాట్ సరస్సు సంరక్షణ ముఖ్యమని కలెక్టర్ తెలిపారు.

==========================

“కోనసీమ క్రీడోత్సవాలు ఆటలతో ఆరోగ్యం" కార్యక్రమాల కోసం పటిష్టమైన ఏర్పాట్లను చేయాలని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు అమలాపురం కలెక్టరేట్ లో ఈ రోజు ఆయన అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ... ఈనెల 21, 22వ తేదీలలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సుమారుగా 2 వేల 700 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

==========================

జిల్లాలో జీడి పప్పు ప్రాసెసింగ్ చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. సంబంధిత అధికారులతో ఆయన ఈ రోజు దృశ్య మాధ్యమం ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.... సాలూరు, గుమ్మలక్ష్మీపురం, కురుపాంలలో ప్రాసెసింగ్ కేంద్రాలు ఏర్పాటుకు అవసరమైన యంత్ర పరికరాలను సిద్ధం చేయాలని సూచించారు. సిబ్బందికి తగిన శిక్షణ ఇప్పించాలని కలెక్టర్ ఆదేశించారు.

==========================

రోడ్డు భద్రతా నియమాలను ప్రతి ఒక్కరు పాటించాలని చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ కోరారు. ఈరోజు నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు జరగనున్న 36వ జాతీయ రహదారి భద్రతా మహోత్సవాల కరపత్రాలను.. కలెక్టరేట్ లో ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ... రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు రోడ్డు భద్రతా వారోత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు.

==========================

రహదారులపై ప్రయాణం చేసే క్రమంలో భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని తూర్పుగోదావరి జిల్లా సంయుక్త కలెక్టర్ ఎస్. చిన్న రాముడు పేర్కొన్నారు. ఆ మేరకు రవాణా వ్యవస్థ అధికార యంత్రాంగం అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.  జాయింట్ కలెక్టర్ ఛాంబర్ లో "జాతీయ రహదారులు భద్రత మాసోత్సవాలు - 2025" గోడ పత్రికని జిల్లా రవాణా అధికారి ఆర్.సురేష్ తో కలిసి ఆయన ఈ రోజు ఆవిష్కరించారు.

===========================

===========================